క్లుప్తంగా

28న గురుకులంలో కౌన్సెలింగ్

నర్సాపూర్: కాలేజీలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 28న తమ రెండవ విడత కౌన్సెలింగ్ చేపట్టనున్నామని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. కాలేజీలో 2024 – 25 సంవత్సరానికి సీఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 28న తమ పదవ తరగతికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తమ కాలేజీ వద్ద చేపట్టే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

మొక్కలు సిద్ధం చేయాలి



చిట్కుల్‌లో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షకాలం ప్రారంభం నాటికి నర్సరీ మొక్కలు సిద్ధం చేయాలని ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్, చిట్కుల్ గ్రామాల్లోని నర్సరీ, డంప్‌యార్డ్, శ్మశానవాటిక, పల్లె ప్రకృతివనాలను సందర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శులు కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని రామోజిపల్లి, కొత్తపేట, వీరోజిపల్లితో పాటు పెద్దశంకరంపేటలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గ్రేస్‌బాయి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈఓ రవీందర్, ఐకేపీ సిబ్బందికి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని పూర్తి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.

ఆకస్మిక తనిఖీ



మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

నర్సాపూర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులు పరిశీలించి రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా కార్యాలయ రికార్డులను ఆఫీస్ సూపరింటెండెంట్ మనోహర్ సీఈఓకు అందచేయగా ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ సీఈఓ రంగా చార్యులు ఉన్నారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన



దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్ఐ

కొల్చారం(నర్సాపూర్): మండలంలో గడిచిన గురువారం గాలి వాన బీభత్సానికి దెబ్బతిన్న ఇళ్లను శనివారం ఆర్ఐ ప్రభాకర్ పరిశీలించారు. తుక్కాపూర్ గ్రామానికి చెందిన చిన్న లచ్చిగారి దానయ్య, బాల సుగుణమ్మ నివాస పూరిండ్ల పై కప్పులు ఎగిరిపోయి గోడలు దెబ్బతిన్నాయి. వర్షానికి తిండి గింజలు తడిసిపోయాయి. పంచనామ నిర్వహించిన ఆర్ఐ నివేదికను ఉన్నతాధికారులకు అందించి, బాధితులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, గంగయ్య తదితరులు ఉన్నారు.

విత్తనాలకు బిల్లులు తప్పనిసరి

- నర్సాపూర్ వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి సంధ్యారాణి



నర్సాపూర్ రూరల్: సీతారాంపూర్‌లో విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

నర్సాపూర్ రూరల్: విత్తనాలు కొనేటప్పుడు బిల్లులు తీసుకోవాలని నర్సాపూర్ వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి సంధ్యారాణి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని సీతారాంపూర్‌లో నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు గుర్తింపు పొందిన దుకాణాల్లోనే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో ప్యాకింగ్ ఉన్న విత్తనాలను కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ చంద్రవేణి పాల్గొన్నారు.

టేక్మాల్ మండలంలో..

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాం ప్రసాద్ తెలిపారు. మండలంలోని బోడగట్టు, కమ్మరికత్త, వెల్పుగొండ గ్రామాల్లో రైతులతో సమావేశాలను నిర్వహించారు. ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారులు మీనా, ఇంద్రయ్య, మంజుల, ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని బుజ్రాన్‌పల్లి, గోపని వెంకటాపూర్, దానంపల్లి, శివాయిపల్లి, ఆరేపల్లి, చీలాపల్లి తదితర గ్రామాల్లో ఏఈఓలు స్వాతి, సుభాష్‌కిరణ్ రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు గుర్తింపు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని ఏఓ స్వప్న తెలిపారు. కౌడిపల్లి, ధర్మాసాగర్, తునికి, హరిచంద్‌తండా, మహ్మద్‌నగర్, శేరితండా గ్రామాల్లో విత్తనాల కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, దివ్యశ్రీ, ఆత్మ బీటీఎం గౌతమి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు నకిలీ విత్తనాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించామని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. ఆయన మండల పరిధిలోని చండూర్, ఫైజాబాద్, చిలప్‌చెడ్, గుజిరితండాల రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు రమ్య, భూపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని నర్సాపూర్ వ్యవసాయ సంచాలకులు సంధ్యారాణి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విత్తన కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య ఉన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఏడీ పుణ్యవతి ఏఓలు రాజశేఖర్, ఝాన్సీ, ఏఈఓలు సాయికుమార్, గౌతమి, వందన, ఉత్తమ్ కుమార్, రజిత తదితరులున్నారు.

మనోహరాబాద్‌లో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు సచిన్, నరేందర్‌గౌడ్, రైతులు తదితరులున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

అల్లాదుర్గం(మెదక్): అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ రాజేశ్ హెచ్చరించారు. అల్లాదుర్గంతో పాటు పలు గ్రామాల్లో విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రాంప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



కోనాయపల్లి(పీటీ)లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి, ఆగ్రహారం గ్రామాల్లో మెదక్ వ్యవసాయశాఖ ఏడీఏ విజయ నిర్మల రైతులకు పంటల సాగు, విత్తనాల నాణ్యతపై అవగాహన కల్పించారు. ఏఓ ప్రవీణ్, ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం కోసం విత్తన కొనుగోలుపై గ్రామాల్లో అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఏఓ హరిప్రసాద్, ఏఈఓలు అశోక్‌రెడ్డి, మాధవి, శోభరాణి, భువనేశ్వరి, ప్రవీణ్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చూడాలి

- జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలు, తండాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. శనివారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మంచినీటి సరఫరా, ఉపాధిహామీ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, తండాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని చెప్పారు. వర్షాకాలం వస్తున్నందున పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేపట్టి కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉండటంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రంగాచార్యులు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏఓ జావీద్

రేగోడ్(మెదక్): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ జావీద్ తెలిపారు. రేగోడ్‌తో పాటు ఆర్.ఇటిక్యాల, జగిర్యాల, మర్పల్లి, సిందోల్, పోచారం గ్రామాల్లో శనివారం విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. లూజుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాన్నారు. గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వినిత్ కుమార్, సునీల్ కుమార్, భూలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీ రోడ్డు



బొల్లారం శివారులో రోడ్డు దుస్థితి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని బొల్లారం శివారు మెదక్ – వెల్దుర్తి రోడ్డుపై తండాలో వచ్చిన నీరు ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొల్లారం శివారులోని మెదక్ – వెల్దుర్తి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి రాత్రి వేళల్లో అందులో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. నిత్యం నీరు ప్రవహిస్తుండడం, రోడ్డుపై నుంచి వాహనాలు వెళ్తుండడంతో గుంతలు మరింత పెద్దగా ఏర్పడి ప్రమాదకరంగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్త చేశారు. అధికారులు నీటి ప్రవాహాన్ని అరికట్టి గుంతలను పూడ్చి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కనులపండువగా వీరభద్రుడి కల్యాణం

- స్వామివారిని దర్శించుకున్న మంత్రి దామోదర



మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి కల్యాణోత్సవంలో శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ సన్మానించి ఆలయ మోమెంటోను అందించారు. ఏడుపాయల ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్ తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను, ఎదుర్కొళ్లను జరిపి స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులపండువగా చేశారు. అనంతరం వీరభద్రుడికి భక్తులు ఒడిబియ్యాన్ని సమర్పించారు. బొడ్మట్‌పల్లికి చెందిన ముద్దాపూరం శ్రీశైలం కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో షావ ఊరేగించారు. ఇందులో అల్లాదుర్గం సీఐ రేణుక, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, మండల సీనియర్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

నేడు నాగ దేవత, పోచమ్మ ఆలయాల వార్షికోత్సవం

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేటలో వెలసిన శ్రీ సంతాన నాగదేవత, నల్ల పోచమ్మ ఆలయాల ఆరవ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ డాక్టర్ దండేపు బస్వానందం శనివారం తెలిపారు. ఈ పూజల్లో భాగంగా ఉదయం గ్రామ దేవతల అభిషేకం, అలంకరణ, శివునికి రుద్రాభిషేకం, నవగ్రహ గణపతి హోమం చేస్తారు. మధ్యాహ్నం భక్తి భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. వార్షికోత్సవంలో స్థానికులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

కల్యాణం కమనీయం



నందిగామలో మడేలేశ్వర దేవి కల్యాణంలో రజక కులస్తులు

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామంలో రజక కులస్తుల ఆధ్వర్యంలో వార్షికోత్సవంలో భాగంగా శనివారం మడేళ్వర శీతల దేవి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి, గ్రామ అధ్యక్షుడు లింగ స్వామి, ఉపాధ్యక్షుడు పరశురాములు, సలహా దారులు దుర్గయ్య, నర్సింలు, మల్లేశ్, నాగరాజు, లక్ష్మణ్, పరశురాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'మా సమస్యలు పరిష్కరించండి'



డీఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తూప్రాన్: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు యూఈఈయూ సీఐటీయూ యూనియన్ గౌరవాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగానే ఈ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో తూప్రాన్ విద్యుత్ డీఈ కీ సమస్యలతో కూడిన విన్నపత్రం శనివారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నర్సింలు, రజినీకాంత్, జీవన్, హనుమంతు, భిక్షపతి, సునిల్, సలీం, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు

రామాయంపేట(మెదక్): తెలంగాణలోని బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, ఇతర ఉద్యోగులకు వేతనాలు పెరిగాయని బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో బీడీ ఫ్యాక్టరీల యజమాన్యాలకు, కార్మిక నాయకులకు మధ్య జరిగిన చర్చల్లో వేతన ఒప్పందం కుదిరిందని వారు పేర్కొన్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా ?



కిందకు వేలాడుతున్న వైర్లు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని విద్యుత్ వైర్లు కిందకు వేలాడి తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల పరిధిలోని బాలానగర్ శివారులోని దూసమడుగు తండా ఊర చెరువు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న చెరువు అలుపు సమీపంలో కిందకు వేలాడుతున్న వాటిని విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు కరెంట్ వైర్లకు పశువులు, మనుషులు తగిలి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి వైర్లను సరి చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

మురికి కాల్వలు శుభ్రం చేయాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

నర్సాపూర్: వచ్చే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని మురికి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని 9వ వార్డుతో పాటు ఇతర కాలనీల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. మురికి కాల్వలు చెత్త చెదారంతో నిండకుండా చర్యలు తీసుకొని వర్షం నీరు సాఫీగా కింది భాగానికి వెళ్లేలా కాల్వలు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. రోడ్లు శుభ్రంగా ఉంచాలని, మురికి కాల్వల పక్కన బ్లీచింగ్ పౌండర్ చల్లాలని సూచించారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని మంచి స్థాయికి ఎదగాలని పాంబండ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మోహన్‌రావు అన్నారు. శనివారం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రొవిజనల్ మార్క్స్ మెమో, టీసీ, బోనఫైడ్ ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, తదితరులు ఉన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ పౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి'

కౌడిపల్లి(నర్సాపూర్): పద్మశాలీలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జయరాములు తెలిపారు. శనివారం కౌడిపల్లికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం ఎన్నికలు త్వరలో జరుగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నర్సింలు, మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు నర్సింలు, పోల జనార్ధన్, ప్రభాకర్, రంగేష్, శేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీబాల వీర హనుమాన్ ఆలయం వద్ద శనివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. ఆలయ నిర్మాత, అర్చకులు మెట్టు రాములుశర్మ ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు.

◆ అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎం సిరోమణి ఆధ్వర్యంలో అవసరం ఉన్నవారికి వ్యాధినిరోధక టీకాలు ఇచ్చి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్ చెన్నమ్మ, అంగన్‌వాడీ ఆయా లింగమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం స్వామివారికి ఆలయ అర్చకుడు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు.

◆ మురుగు కాల్వలు శుభ్రం చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): తమ గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేయాలని ఎంపీడీఓకు వినతి పత్రం అందజేత. శనివారం మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన గుత్తి ఆంజనేయులు తమ గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేయాలని ఎంపీడీఓకు ఫిర్యాదు చేశాడు. వారం రోజులుగా మురుగు కాల్వతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

◆ పాఠశాల గుర్తింపు రద్దు

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోని మండల కేంద్రంలోని లేక్ యూ ప్రైవేట్ పాఠశాల గుర్తింపును జిల్లా విద్యాధికారి రద్దు చేసినట్లు మండల ఎంఈఓ నీలకంఠం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించొద్దని సూచించారు.

◆ ఫీజుల నియంత్రణ చేపట్టాలి

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే వాటిపై నియంత్రణ చేపట్టాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో 'కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్న ప్రభుత్వం నియంత్రించక పోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయకులు సురేందర్, నాగరాజు, దళిత సంఘం జిల్లా నాయకులు దయాకర్, ఏఐఎస్ఐ జిల్లా కార్యదర్శి దినకర్, మల్లేశం, నర్సమ్మ, గీత, పద్మారావు, సత్యం, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

◆ భగవంతుడి స్మరణ ముక్తికి మార్గం



పాపన్నపేట(మెదక్): ప్రతి నిత్యం భగవంతుడి స్మరణ చేస్తే ముక్తికి మార్గం లభిస్తుందని మాధవనంద సరస్వతి అన్నారు. శనివారం ఆయన ఏడుపాయలలో డాక్టర్ కావూరి శ్రీనివాస్ రాసిన ఏడుపాయల వన దుర్గా భవాని పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజశేఖర శర్మ, శ్యాం సుందర్, నర్సింలు, ఇంద్ర సేనారెడ్డి, యాబన్న, భూమయ్య, అశోక్, రవీందర్, మహేందర్, సాయిబాబా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎదుల్లాపూర్‌లో ఉర్సు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ఎదుల్లాపూర్ గ్రామంలో శనివారం రాత్రి ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో మత గురువులు, ఎంపీపీ హరికృష్ణ, కేహెచ్ఆర్ సోషల్ వెల్ఫర్ అధ్యక్షుడు హన్మంతరావు, గ్రామస్తులు ఉన్నారు.

